క్లుప్తంగా

దీపావళి శుభాకాంక్షలు



రాయచోటి (జగదాంబసెంటర్)/రాజంపేట/రైల్వేకోడూరు అర్బన్ : దుష్ట శిక్షణ శిష్ట రక్షణకు ప్రతీకగా దీపావళి నిలుస్తుందని రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. జ్ఞానానికి, ఆనందానికి, వికాసానికి, విజయాలకు ప్రతి రూపం దీపావళి అని వారు పేర్కొన్నారు. ప్రజలందరికీ సకల శుభాలు, శాంతి సౌభాగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ వారు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

ఈకేవైసీ తప్పనిసరి

రామాపురం : రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత గ్యాస్ కోసం లబ్ధిదారులు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ప్రభాకర్ ఇండియన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ సి.వి.సుబ్బారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత గ్యాస్‌ను దీపం పథకం, ఉజ్వల పథకం కింద గ్యాస్ తీసుకున్న లబ్ధిదారులు, రేషన్‌కార్డు ఉండి డిపాజిట్ కనెక్షన్‌ను పొందిన లబ్ధిదారులందరికీ ఉచిత గ్యాస్ పథకం వర్తిస్తుందన్నారు. ఇప్పటి వరకు సుమారు 14వేల మంది ఈకేవైసీ చేయించుకోగా ఇంకా 20 శాతం మంది ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

యూటీఎఫ్‌కు నూతన మండల కమిటీ

పుల్లంపేట : రాజంపేట జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో జరిగిన ప్రాంతీయ స్వర్ణోత్సవ మహాసభలలో పుల్లంపేట మండలానికి యూటీఎఫ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా హరిప్రసాద్ ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. పుల్లంపేట యూటీఎఫ్ నూతన అధ్యక్షులుగా సాంబశివ రావు, ప్రధాన కార్యదర్శిగా వెంకటరమణ, కోశాధికారిగా శంకరయ్యలు ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీకి కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

పెండింగ్‌లో ఉన్న పక్కా గృహాలను పూర్తి చేయండి



లబ్ధిదారుల ఇళ్లను పరిశీలిస్తున్న డీఈ శివయ్య

లక్కిరెడ్డిపల్లి : గత ప్రభుత్వంలో మంజూరైన పక్కా గృహాలు పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని హౌసింగ్ డీఈ శివయ్య పేర్కొన్నారు. బుధవారం లక్కిరెడ్డిపల్లిలోని చింతకుంటపల్లి లేఔట్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పక్కా గృహాలు మొదలుపెట్టి మధ్యలో ఆగిపోయిన వాటిని గుర్తించి వారి సమస్యలను అడిగి తెలుసుకొని వెంటనే బిల్లులు అందిస్తామని, త్వరితగతిన ఇల్లు పూర్తి చేసుకోవాలన్నారు. లబ్ధిదారులు కాలనీలో రోడ్డు, విద్యుత్ సదుపాయాలు లేనిచోట వెంటనే ఏర్పాటు చేస్తామని లబ్ధిదారులు ముందుకు వచ్చి తొందరగా పక్కా గృహాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే అందిస్తామని ఆయన లబ్ధిదారులకు వివరించారు. డిసెంబర్‌లో నూతన పక్కా భవనాలు మంజూరు చేస్తామని వారన్నారు. అర్హులైన వారు నూతన పక్కా గృహాలుకోసం దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రెడ్డయ్య, హౌసింగ్ ఏఈ జనార్దన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వర్గపోరుతో అభివృద్ధి శూన్యం

- ఒంటిమిట్ట మండలంలో తారాస్థాయికి టీడీపీ వర్గపోరు
- అధికార పార్టీలో రెండు వర్గాల పోరుతో అభివృద్ధి శూన్యం
- అభివృద్ధి పనులు జరగక ఇబ్బందులు పడుతున్న మండల ప్రజానీకం



ఒంటిమిట్ట : తెలుగుదేశం పార్టీ 2024 శాసనసభ ఎన్నికల్లో జనసేన, బిజేపీ పార్టీలతో కూటమిగా ఏర్పడి విజయం సాధించి, అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కావస్తున్నా కూటమి ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో విఫలమైంది. ఇది ఇలా ఉండగా 2024 ఆగస్టు 23వ తేదీన ప్రతిష్టాత్మకంగా గ్రామాల అభివృద్ధికోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన గ్రామసభల్లో గ్రామాల అభివృద్ధి గురించి వచ్చిన వినతి పత్రాలపై రాష్ట్ర వ్యాప్తంగా పలు మండలాలలో ఉన్న వర్గపోరు కారణంగా అభివృద్ధి ముందుకు సాగలేదని తెలుస్తోంది. దీనికి నిదర్శనంగా ఒంటిమిట్ట మండలం నిలుస్తుంది. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత రాజంపేట నియోజకవర్గంలో శాసనసభ్యుడిగా పోటీ చేసిన వ్యక్తి ఓటమి పాలు కావడంతో రాజంపేట నియోజకవర్గాన్ని అభివృద్ధిపథంలో నడిపించేందుకు గుత్తేదారులకు ప్రభుత్వ అభివృద్ధి పనులను మంజూరు చేసి అప్పచెప్పడంలో అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. ఇందులో ముఖ్యంగా ఆంధ్ర భద్రాద్రిగా పేరు గడిస్తున్న ఒంటిమిట్ట మండలం ఉందని చెప్పుకోవచ్చు. ఎందుకంటే ఒంటిమిట్ట మండలంలో ఈ ఏడాది ఆగస్టు 23వ తేదిన రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ఆధ్వర్యంలో ప్రారంభించిన గ్రామ సభలకు పలు ప్రాంతాలలో అభివృద్ధి పనులు చేయించాలని ప్రజల నుంచి వినతిపత్రాలు వచ్చాయి. గ్రామ సభలు జరిగి మూడు నెలలు కావస్తున్నా వినతిపత్రాలకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఎందుకు చర్యలు తీసుకోలేదన్న దానిపై సాక్షి ఆరా తీయగా ఒంటిమిట్ట మండలంలో టీడీపీ వర్గపోరు తారాస్థాయికి చేరడమే దీనికి కారణమని పలువురు విశ్లేషకులు, ప్రజలు వాపోతున్నారు. దీంతో ఆంధ్రా భద్రాద్రిగా పేరు గడిస్తూ పర్యాటక ప్రదేశంగా ఉన్న ఒంటిమిట్ట మండల పరిసర ప్రాంతాలను చూసేందుకు వచ్చిన పర్యాటకులు, భక్తులు మౌళిక వసతులు, అభివృద్ధి పనులకు నోచుకోని ఆంధ్ర భద్రాద్రిని చూసి నిరుత్సాహాన్ని వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ వర్గ పోరుతో స్థానిక అధికారులు కూడా మండల అభివృద్ధి పనులపై ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేక పోతున్నారు. దీనికి నిదర్శనం గతంలో టీడీపీ నాయకుల ఫ్లెక్సీలను చించేయడమే కాక, కొన్ని రోజుల క్రితం రెండు వర్గాల నాయకులు ఘర్షణపడటం ఆధారంగా తీసుకోవచ్చు. ఈ వర్గపోరు కారణంగా మండలంలోని పలు కాలనీలలో సీసీ రోడ్లు లేక వర్షాకాలం వస్తే ఇబ్బంది పడుతున్న ప్రజలు, అలాగే డ్రైనేజీ లేక వర్షం వస్తే ఇంటిలోనికి నీరు చేరుతున్న లోతట్టు ప్రాంతాల ప్రజలు, అలాగే పాడి రైతులుకోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మినీ గోకులాలు మంజూరు చేయకపోవడంతో వస్తాయా రావా అన్న ఆందోళనలో పాడి రైతులు ఉన్నారు. ఇవే కాకుండా మరెన్నో అభివృద్ధి పనులకు టీడీపీ వర్గ పోరు ప్రత్యక్షంగాను, పరోక్షంగాను కారణమవుతుందని విశ్వసనీయ సమాచారం. టీడీపీ ఇన్‌చార్జి లేని రాజంపేట నియోజకవర్గంలో ఎవరికి వారు తామే ఇన్‌చార్జి అనుకుంటూ ప్రజలకు అందాల్సిన సంక్షేమ పథకాలు గానీ, అభివృద్ధి పథకాలు కానీ అందించడంలో తీవ్ర జాప్యం చేస్తూ ప్రజలను ఇబ్బందులు గురి చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు రాజంపేట నియోజకవర్గం ఇన్‌చార్జిని ప్రకటించి, నియోజకవర్గంలో జరుగుతున్న సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరించి అభివృద్ధి పనులకు ఆటంకం కలగకుండా చూడాలని మండల ప్రజలతోపాటు, రాజంపేట నియోజకవర్గ ప్రజలు కూడా ఆశిస్తున్నారు.

వరి పంటకు తెగుళ్లు సోకాయి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ

సిద్దవటం : ఖాజీపల్లె గ్రామంలోని రైతులు సాగుచేసిన వరి పంటకు కాండం తొలుచుపురుగు, ఆకునల్లి, పాముపొడ తెగుళ్లు సోకాయని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజ తెలిపారు. సిద్దవట మండలంలోని టక్కోలు రైతు సేవా కేంద్రం పరిధిలోని ఖాజీపల్లెలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ కాండం తొలుచు పురుగు నివారణకు ఫ్లూబెండమైండ్ ఎకరాకు 50 మిల్లీ లీటర్ల లీటరు నీటికి 0.25 మిల్లీ లీటర్లు చొప్పున పిచికారి చేయాలన్నారు. ఆకునల్లి నివారణకు ప్రొఫెనోఫోస్ 2 మిల్లీ లీటర్‌లు ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. పాము పొడ తెగులు నివారణకు షీత్ మార్ (వాలిడామైసిన్) 2 మిల్లీ లీటర్లకు ఒక లీటరు నీటిని కలిపి పిచికారీ చేయాలన్నారు. పేడ, మూత్రము, సున్నం, నీరు, పుట్టమన్ను వినియోగించి బీజామృతము విత్తన శుద్ధి కొరకు తయారు చేసి వినియోగ విధానంపై రైతులకు అవగాహన కల్పించడం జరిగింది. వరిలో యూరియాకు ప్రత్యామ్నాయంగా అజోల్లా వాడకం, సూడో మోనాస్, ట్రైకోదర్మ వంటి జీవ సంబంధ తెగుళ్ల నివారణ మందులపై అవగాహన కల్పించడం జరిగింది. రబీలో నువ్వులు, వేరుశనగ, కూరగాయలు, పొద్దుతిరుగుడు వంటి పంటల సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఉప సంచాలకులు డి.వి. రమణారెడ్డి, ఏరువాక సమన్వయకర్త డాక్టర్ కె.అంకయ్యకుమార్, మండల వ్యవసాయాధికారి రమేష్ రెడ్డి, రైతులు ప్రకృతి వ్యవసాయ అధికార సిబ్బంది సింగరయ్య, చిన్నక్క, ఐసీఆర్‌పీలు, రైతు సేవా కేంద్రం సహాయకులు పాల్గొన్నారు.

రైతులు ప్రకృతి వ్యవసాయంపై శ్రద్ధ చూపాలి

వీరబల్లి : మండలంలోని రైతులు ప్రకృతి వ్యవసాయంపై శ్రద్ధ చూపాలని అన్నమయ్య జిల్లా జేడీ చంద్ర నాయక్ తెలిపారు. మట్లి గ్రామపంచాయతీలో బుధవారం పొలంబడి పిలుస్తోంది కార్యక్రమంలో వారు పాల్గొని పంటలను పరిశీలించారు. అంనతరం రైతు సేవా కేంద్రంలో రైతుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రైతులు పండించే పంటలకు రసాయన ఎరువులు కన్నా కృత్రిమ ఎరువులు వాడటం వలన అధిక దిగుబడులు వస్తాయన్నారు. రైతులు సాగుచేసిన పంటలకు క్రాప్ బుకింగ్ ఖచ్చితంగా చేయించుకోవాలన్నారు. పంటలపై లోన్లు తెచ్చుకునే రైతులు ఇన్సూరెన్సు కూడా చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిస్వాతి, రైతు భరోసా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులలో అవకతవకలు లేకుండా చూడాలి



మాట్లాడుతున్న ఉపాధిహామీ పీడీ వెంకటరత్నం

సుండుపల్లి : ఉపాధి పనులలో అవకతవకలు లేకుండా చూడాలని లేకుంటే కఠిన చర్యలు తప్పవని ఉపాధిహామీ పీడీ వెంకటరత్నం తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సామాజిక తనిఖీ (ఓపెన్ ఫారం) నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ పనులలో అవినీతి జరగకుండా చూడాలని, ఏదైనా అవినీతి జరిగితే దానికి కారణం సిబ్బంది అని తెలిపారు. ఉపాధి హామీ పథకంలో రూ.12.32 కోట్ల మేర పనులు చేశారని, రూ.4 లక్షలు రెక్టిఫికేషన్ కావాల్సి ఉండగా రూ. 45,540 రికవరీ అయినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏపీడీలు ప్రతాప్, నందకుమార్‌రెడ్డి, ఎంఎన్‌డీ బాలమునెయ్య, ఎస్టీఎం లోకేశ్వర్‌రెడ్డి, ఎస్‌ఆర్పీ లోకేష్, ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, ఏపీఓ మాలిక్‌బాషా, ఆర్‌బీకేలు, ఉపాధిహామీ సిబ్బంది, సామాజిక తనిఖీ సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోళ్లు లేక టపాసుల దుకాణాలు వెలవెల



దుకాణాల వద్ద కనిపించని దీపావళి సందడి

పెనగలూరు : మండలంలో టపాసు దుకాణాలు మంగళవారం కొనుగోలులేక బోసిపోయాయి. మండలంలో కేవలం టపాసుల అమ్మేందుకు ఐదు మంది మాత్రమే దరఖాస్తులు చేసుకున్నారు. అందులో నలుగురు పెనగలూరుకు, ఒకరు చక్రంపేటకు పర్మిషన్లను తీసుకున్నారు. పెనగలూరులో హైస్కూల్ ఎదురుగా సిద్దవరం రోడ్డులో తహసీల్దార్ కార్యాలయం ముందు భాగాన గదులలో దుకాణాలు పెట్టారు. మంగళవారం ఉదయం నుండి దుకాణాలలో టపాసులు కొనేవారు కనిపించలేదు. సాయంత్రం టపాసులు దుకాణాలు బోసిపోవడంతో ఈ ఏడాది వ్యాపారం సక్రమంగా జరగలేదని వ్యాపారస్తులు ఆవేదన చెందుతున్నారు. రైతులకు సక్రమంగా పంటలు పడక, లాభాలు రాకపోవడంతోపాటు ప్రభుత్వం నుండి ప్రజలకు పథకాలు అందకపోవడంతో టపాసుల దుకాణాలు బోసిపోవడానికి ఒక కారణంగా చెప్పవచ్చు.

సర్దార్ పటేల్ ముందస్తు జయంతి వేడుక



జయంతి వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు

పుల్లంపేట : మండల పరిధిలోని దళవాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో బుధవారం ముందస్తు సర్దార్ వల్లబాయ్ పటేల్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సర్దార్ వల్లబాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయుడు రమణ మాట్లాడుతూ సర్దార్ వల్లబాయ్ పటేల్ ఉక్కు మనిషి అని, ఆయన కృషి ఫలితంగా హైదరాబాద్ వంటి చిన్నచిన్న సంస్థానాలు మన భారతదేశంలో కలిసి ఏక్ భారత్‌గా ప్రపంచపటంలో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆలోచనలు ఉన్నతంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ లక్ష్మీప్రసాద్‌రెడ్డి

రాజంపేట టౌన్ : విద్యార్థుల ఆలోచనలు ఉన్నతంగా ఉన్నప్పుడే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని అర్బన్ ఎస్‌ఐ లక్ష్మీప్రసాద్‌రెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు పి.వెంకటరమణ ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్ధాలు, నష్టాలపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీ.పురుషోత్తం అధ్యక్షతన నిర్వహించిన ఈకార్యక్రమానికి ఎస్‌ఐ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. మాదకద్రవ్యాలు మనిషి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తాయన్నారు. విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లో చెడు అలవాట్లవైపు మొగ్గు చూపవద్దని కోరారు. మాదకద్రవ్యాలను తీసుకున్నా, విక్రయించినా చట్టరీత్యా నేరమన్నారు. ఇలాంటి కేసుల్లో ఒక్కసారి ఎఫ్‌ఐఆర్ నమోదు అయితే ఉద్యోగ అవకాశాలకు కూడా అనర్హులవుతారన్నారు. ఈ విషయాన్ని విద్యార్థులు గుర్తుంచుకోవాలని తెలిపారు. తల్లిదండ్రుల ఆశలన్ని పిల్లలపైనే ఉంటాయని, వారి ఆశలను అడియాశలు చేసే ఏ పని కూడా చేయవద్దని సూచించారు. ఈ ప్రపంచంలో నిస్వార్ధమైన ప్రేమను చూపేది ఒక్క తల్లిదంత్రులే అన్నారు. డిగ్రీ చదివే విద్యార్థులంతా టీనేజీలో ఉంటారని, టీనేజీ వయస్సు జీవితాన్ని తప్పుదోవ పట్టించే ప్రమాదకరమైనది కూడా అన్నారు. కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధి షేక్ అబ్దుల్లా, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కె.వెంకటనరసయ్య, పీడీ విజయభాస్కర్ అధ్యాపకులు పాల్గొనారు.

పీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్



పరికరాలను అందజేస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్

రాయచోటి : జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రసవాల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్‌లోని చాంబర్‌లో ప్రసవాలలో మెరుగైన ఫలితాలను సాధించిన పీహెచ్‌సీ వైద్యాధికారులకు కలెక్టర్ వైద్య పరికరాలను అందజేశారు. ఇందులో భాగంగా స్టెతస్కోపులు, బేబీ వార్మర్స్, ఒక పీహెచ్‌సీకి ఇన్వర్టర్‌ను కలెక్టర్ అందజేశారు. వైద్యసేవలలో భాగంగా నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ సూచించారు. ఒక్క మాతా శిశు మరణం కూడా సంభవించరాదని తెలియజేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ ఎస్.కొండయ్య, డీపీఎంఓ ఎం.రియాజ్‌బేగ్, చిన్నమండెం, మొలకలచెరువు, నగిరిమడుగు, దేవలంపల్లి మెడికల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

15న అరుణాచలంకు బస్సు సర్వీసు

రాజంపేట : వచ్చేనెల 15న అరుణాచలం(తిరువణ్ణామలై)కు రాజంపేట డిపో నుంచి ప్రత్యేక బస్ సర్వీసును నడిపిస్తున్నట్లు డీఎం రమణయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజంపేటలో ఉదయం 6 గంటల నుంచి బయలుదేరుతుందన్నారు. వివరాలకు ఆర్టీసీ బస్టాండులోని రిజర్వేషన్ కౌంటర్‌ను సంప్రందించాలన్నారు.

ఉచిత కంటి వైద్య సేవలు

వీరబల్లి : పెద్దివీడు రెడ్డివారిపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో బుధవారం విద్యార్థులకు ఉచిత కంటి వైద్య సేవలను నేత్రాలయ ఐ క్లినిక్ డాక్టర్ రెడ్డి రేష్మిత ఆధ్వర్యంలో అందించారు. అవసరం ఉన్న విద్యార్థులకు మందులు, కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మధుసూదన్‌రాజు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు అండగా ఉండండి



వైఎస్ జగన్‌తో మాట్లాడుతున్న కొరముట్ల

రైల్వేకోడూరు అర్బన్ : నియోజకవర్గ ప్రజలకు అన్ని వేళలా అండగా ఉండాలని వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించినట్టు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు బుధవారం తెలిపారు. ఇడుపులపాయలో ఆయన్ను కలిసిన సందర్భంగా పలు అంశాలపై చర్చించినట్లు తెలియజేశారు.

పాఠశాలలో వేడుకగా హరిత దీపావళి



స్వచ్ఛ దివాళి కార్యక్రమంలో విద్యార్థులు



కొత్తపేట జెడ్పీహెచ్‌ఎస్‌లో దీపావళి వేడుకలు

పుల్లంపేట : మండల పరిధిలోని కొత్తపేట జెడ్పీహెచ్‌ఎస్‌లో బుధవారం హరిత దీపావళి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.మల్లికార్జున ఆధ్వర్యంలో జరిగింది. వేడుకలో ముఖ్య అతిథిగా ఎంఈఓ చక్రధర్ రాజు హాజరయ్యారు.

కళాశాలలో స్వచ్ఛ దివాళి

రాయచోటి (జగదాంబసెంటర్) : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-1,2 గురప్ప, ప్రసాద్‌ల ఆధ్వర్యంలో వైవీయూ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ వెంకట్రామిరెడ్డి ఆదేశాల మేరకు దివాళి విత్ మై భారత్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ దివాళి కార్యక్రమాన్ని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు.

నిబద్ధతతో పని చేసినప్పుడే గుర్తింపు



క్లెమెంట్ దంపతులను సన్మానిస్తున్న అధికారులు

రాయచోటి టౌన్ : నిబద్ధతతో పనిచేసినప్పుడే ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని అన్నమయ్య జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రఘురాం అన్నారు. బుధవారం అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలోని జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో పీజీఆర్‌ఎస్ హాల్లో నిర్వహించిన పదవీ విరమణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పదవీ విరమణ చేసిన పౌరసరఫరాల సహాయక శాఖ అధికారి క్లెమెంట్ పదవీ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అన్నారు. ప్రతి ఉద్యోగి తమ ఉద్యోగాన్ని నిబద్ధతో నిర్వహిస్తే ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని చెప్పారు. మీరు చూపిన నిబద్ధతే కింది స్థాయి ఉద్యోగులకు మార్గదర్శకం చూపుతుందని చెప్పారు. రిటైడ్ జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

డీఈఓను కలిసిన పీఆర్‌టీయూ నాయకులు

లక్కిరెడ్డిపల్లి : జిల్లా విద్యాశాఖాధికారి కె.సుబ్రమణ్యంను పీఆర్‌టీయూ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు ఎం.సూర్యుడు నాయక్, ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వర్‌లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం వారు ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా చొరవచూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సిద్దు నాయక్, రమణయ్య, హుస్సేన్ బాషా, జయరామరాజు, బలరాం నాయక్, మద్దయ్య, వెంకటరమణయ్య, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

తహసీల్దారుకు సన్మానం



తహసీల్దారు మురాషావలిని సన్మానిస్తున్న ఆర్డీఓ జాన్ ఇర్విన్, సిద్దవటం రెవెన్యూ సిబ్బంది

సిద్దవటం : సిద్దవటం తహసీల్దారు మురాషావలి పదవీవిరణ పొందడంతో ఏపీఎస్పీ 11వ బెటాలియన్ ఆవరణలోని కల్యాణ మండపంలో బుధవారం కడప ఆర్డీఓ జాన్‌ఇర్విన్ ఘనంగా సన్మానించి మాట్లాడారు. మురాషావలి ప్రభుత్వానికి సుదీర్ఘ సేవలు అందించారన్నారు. మురాషావలి మాట్లాడుతూ తన తండ్రి కళతోనే తహసీల్దారు అయ్యానన్నారు. అనంతరం కడప, కమలాపురం, చెన్నూరు, ఒంటిమిట్ట తహసీల్దార్లు, సిద్దవటం డిప్యూటీ తహసీల్దారు మాధవీలత, విద్యుత్ ఏఈ జయచంద్రలు మాట్లాడారు. అనంతరం తహసీల్దారు మురాషావలికి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కార్యాలయం ఏఓ శంకర్ రావు, కడప డివిజన్ తహసీల్దార్లు, సిద్దవటం ఎస్‌ఐ చిరంజీవి, కడప, సిద్దవటం రేంజర్‌లు ప్రసాద్, కళావతి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభ గల విద్యార్థులకు నిలయంగా అన్నమయ్య యూనివర్సిటీ



విద్యార్థులను అభినందిస్తున్న ఏయూ అధినేత చొప్పా గంగిరెడ్డి

రాజంపేట : ప్రతిభగల విద్యార్థులకు నిలయంగా అన్నమచార్య యూనివర్సిటీ రూపుదిద్దుకుంటోందని ఏయూ అధినేత చొప్పా గంగిరెడ్డి తెలిపారు. బుధవారం జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ (కర్నూలు)లో నిర్వహించిన జాతీయ సాంకేతిక ఉత్సవంలో ఏయూ విద్యార్థులు రాఘవేంద్ర, స్నేహలతారెడ్డి ప్రతిభ చాటుకున్న సందర్భంగా వారిని ఆయన అభినందించారు. నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ఏయూ ముందుకెళుతుందన్నారు. దేశ, విదేశాల్లో ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు అన్నమాచార్య యూనవర్సిటీ కృషిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నారాయణ, సీఎస్‌సీ విభాగాధిపతి డాక్టర్ ఎం.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.